

# చిన్నచిన్న

గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

పినాకపాణి పాతకాలపు లిటరేచరు గ్రాడ్యుయేటు. ఉన్న పిత్రార్జితం కోసం పిత్రీయుల్తో పేచీపడి అతగాడు కోర్టులో గెలిచిందేదో గెలవగా, ఆ గెలిచిన కాస్తానూ అమ్మకాలు చెల్లవన్న కారణం చూపించి సీలింగుల చట్టం స్వాహా చేసింది. పర్యవసానంగా, అతను



మధ్యతరగతిలో దిగువ వర్గానికి దిగజారాడు. దాంతో తన ఇద్దరు కూతుళ్ళకూ పెళ్ళిళ్ళు చేయటం, కొడుక్కు పైచదువులు చెప్పించటం అనేవి పెద్ద సమస్యలయి కూర్చున్నాయి. ఇది ఇట్లా ఉండగా ఒకనాడు, కొంచెం ఆసంటాగా అతనికి అయినవాడైన చక్రవర్తి అనే ఒక ముప్ఫై ఏళ్ళ కుర్రాడు అతనింటికి వచ్చి అన్నాడు- "బాబాయ్! నేను అర్జంటుగా పెళ్ళి చేసుకోవాలి. సెలవుల్లేవు. నువ్వు తక్షణం ఒక మంచిపిల్లను సెలక్ట్ చెయ్యాలి," అని.

కాలం కలిసొస్తే కాలవల్ని కాలవలుగానే కంఠందింపేయగల కాలాంతకుడు పినాకపాణి: అతగాడు ఆలోచించాడు. "ఈ గుంట

డికి పెళ్ళి చేయించటం పుణ్య కార్యమే. కాని, తన పురుషార్థమో? తను నాలుగు డబ్బులు వెనకేసుకుంటే మాత్రం వీడు కాదంటాడా?" — వెంటనే చక్రవర్తి వద్దంటున్నా వినకుండా, పత్రికలో అడ్వర్టయిజ్ మెంట్ ఒకటి పడేశాడు: "కావలెను - కలకత్తాలో పెదకంపెనీలో నెలకు రు. 1500 లు తెచ్చుకుంటున్న అందగాడు, విద్యాధికుడు అయిన ముప్పై ఏళ్ళ యువకునికి - అందము, చదువు, సంస్కారము, గృహకృత్యాల్లో ప్రావీణ్యం వగైరా అన్ని శుభలక్షణాలూ కల్గిగి ఉన్న ఇరవై ఏళ్ళ తెలుగు కన్య. (స్పష్టంగా చెప్పాలంటే, 'వైరాగి' రాసిన 'చిన్న చిక్కు' నవల్లోని హీరోయిన్ లాగా ఉండాలి) కట్నంమీద ఆశలేదు. ఫోటోతో సంప్రదించండి. బాక్సు నెం. 16477, విజయవాడ."

దీనికి సమాధానంగా ఇరవై రోజులగ్గాని మొదటి కవరు పినాకపాణిని చేరలేదు. నెలయ్యేసరికి, ఓ వంద కవర్లు, ఫోటోలతో ఉన్నవి అతనికి చేరాయి.

'కావలెను—కలకత్తాలో పెద్ద కంపెనీలో నెలకు రు. 1500లు తెచ్చుకుంటున్న అందగాడు, విద్యాధికుడూ అయిన ముప్పై ఏళ్ళ యువకునికి—అందము, చదువు, సంస్కారము, గృహకృత్యాల్లో ప్రావీణ్యం వగైరా అన్ని శుభలక్షణాలూ కలిగి ఉన్న ఇరవై ఏళ్ళ తెలుగు కన్య.'

పినాకపాణీ, చక్రవర్తి కూర్చొని వాటిని వడపోసారు. ఒక అర డజను ఫోటోలను ఎన్నిక చేసారు. ఆ అరడజను ఆడపిల్లల తండ్రులకూ ఉత్తరాలు రాసారు. "మీ పిల్లను మీరు ఇక్కడికి తీసుకొచ్చి మాకు చూపించవలసి ఉంటుంది. వైశ్య కళ్యాణ మంటపంలో పెళ్ళికొడుకు మీ చిరంజీవినిఇంటర్వ్యూ చేస్తాడు. మీకు ఇక్కడ అన్ని సదుపాయాలూ మేము చేస్తాము. ఇంటర్వ్యూ తేది 24, ఏప్రియల్. ఇష్టమైతే ఇంటర్వ్యూకు పిల్లతో సహా హాజరు కాగలరు. - పినాకపాణి. (వైశ్య కళ్యాణ మంటపం గవర్నరు పేటలో ఉంది)"

ఇంటర్వ్యూ తేది వచ్చింది. వైశ్య కళ్యాణ మంటపంలో మధ్య హాల్లో, రెండు పెడెస్టల్ ఫాన్లు, వాటి మధ్య నలుచదరంగా నాలుగు సోఫాలు, మధ్యలో టీపాయ్ మీద టీ సామగ్రి వగైరాలు ఏర్పాటు చేసాడు పినాకపాణి. ఇంటర్వ్యూ మొదలయ్యే సమయానికి ఫోటోలతో ఉన్న పైలు పట్టుకొని ఒక సోఫాలో చక్రవర్తి, దాని పక్క సోఫాలో, అప్లికేషన్లతో ఉన్న పైలు పట్టుకుని పినాకపాణీ, కూర్చొనున్నారు.

* * *

ఇంటర్వ్యూ మొదలైంది.

పినాకపాణి తన పక్కన నుంచొనున్న గుమస్తా వైపు చూస్తూ, "వెళ్ళి శ్రీ మహాలక్ష్మిని పిలుచుకురా," అన్నాడు. గుమస్తా పక్కగదిలోకి వెళ్ళి ఒక అమ్మాయినీ, ఒక నడివయస్సాయన్నీ వెంటబెట్టుకొచ్చాడు. పినాకపాణి, "కూర్చోండి" అంటూ వాళ్ళిద్దరికీ తన ఎదుటి సోఫాను చూపించాడు. ఆ ఇద్దరూ, పినాకపాణికి చక్రవర్తికి నమస్కారాలు చేయగా, వీళ్ళిద్దరూ ప్రతి నమస్కారాలు చేసారు. నడివయస్సాయన సోఫాలో కూర్చోగా ఆ అమ్మాయి పక్కన కింది తివాచీ మీద కూర్చోబోయింది. పినాకపాణి, "అహ(హ(. పరవా లేదు, సోఫాలో కూర్చోమ్మా," అన్నాడు. ఆ అమ్మాయి లేచి సోఫాలో కూర్చుంది.

చక్రవర్తి, పినాకపాణి వంక ప్రశ్నార్థకంగా చూసాడు. కానీ, పినాకపాణి పట్టించుకోలేదు.

నడివయస్సాయన్ని చూస్తూ, "నేను పినాకపాణిని, ఇతను నా తమ్ముడి కొడుకు చక్రవర్తి. ఇతనే పెళ్ళికొడుకు," అన్నాడు పినాకపాణి.

ఆయన "నేను గంగాధరాన్నండి. నందిగామలో టీచర్ని."

అంటూ అమ్మాయి వైపు చూస్తూ, "ఇది మా అమ్మాయి, సీతా మహాలక్ష్మి," అన్నాడు.

పినాకపాణి టీపాయ్ మీది గ్లాసుల్లోకి టీ పోస్తూ, "టీ తీసుకోండి," అన్నాడు. నలుగురూ టీ తీసుకున్నారు.

పినాకపాణి అడిగాడు-"నువ్వు ఎంతవరకూ చదువుకున్నావమ్మా?"

సీతామహాలక్ష్మి, తల దించుకొని కూర్చునున్న దల్లా తలెత్తి ఎదురుగా చూసింది. "పద్దో క్లాసండి," అన్నది.

"బాగుంది," అన్నాడు పినాకపాణి.

చక్రవర్తి, అంతవరకూ తన ఫైల్లో ఏదో రాసుకుంటున్న వాడల్లా హఠాత్తుగా ముందుకు వంగి, "మ్యూజిక్ కూడా ఏమయినా నేర్చుకున్నారా?" అన్నాడు.

లక్ష్మి సిగ్గుతో మెలికలు తిరిగి పోయింది. గంగాధరం అన్నాడు- "ఏదోనండి. తినటానికి లోటులేని సంసారం మాది. సరదాపడి పిల్లకు నాలుగు రాగాలేవో నేర్పించాను."

చక్రవర్తి ఆవేశంగా, "వెరీ గుడ్, అయితే, లక్ష్మిగారూ! గిటారువాయించగలరా?" అన్నాడు.

లక్ష్మి ఎదురుగా తలెత్తి చూసి, "కటారాండి! కటారంటే కత్తి గదండీ!" అంది. అంటూ ఆమె తన తండ్రి వైపు చూడగా, అతను పినాకపాణి వైపుచూడగా, పినాకపాణి చక్రవర్తి వైపుచూడగా, చక్రవర్తి తల దించుకున్నాడు.

నాలుగైదు క్షణాలాగి పిల్ల తండ్రి- "అమ్మాయి గాత్రం మాత్రమే సాధన చేస్తోంది. మీరు చెప్పిన తంత్రం దాకా ఇంకా రాలేదండి," అని తన కూతురు వైపు చూస్తూ, "ఏదమ్మా, ఒక రాగం వినిపించు," అన్నాడు.

లక్ష్మి మెల్లిగా తలెత్తి పినాకపాణి వంక చూసింది. పినాకపాణి, 'పాడు' అన్నట్లు తల ఎగరేసాడు. లక్ష్మి సన్నగా గొంతు సవరించుకొంది. ఆలాపన మొదలు పెట్టింది.

"ఆఁ ఆఁ ఆఁ ఆఁ....ఆఁ ఆఁ ఆఁఆఁ....తుమ్మెదా ఆఁ. ఆఁ ఆఁ ...."

రాగం శ్రావ్యంగా లేదు. ఆ విషయం తండ్రీకొడుకుల మొహాలే చెబుతున్నాయ్.

"తుమ్మెదా....తుమ్మెదా, ఒకసారి మోమెత్తి చూడమనవే రాచిలక తోడ ఆఁ ఆఁ ఆఁ.... తుమ్మెదా...."

హఠాత్తుగా చక్రవర్తి ముందుకు

వంగి. "తమ్ముళ్ళతారా, ఆపండాపండి తమ్మొద్దు." అన్నాడు.

చటుక్కున రాగం ఆగిపోయింది. లక్ష్మి కళ్ళల్లో బెదురు చూపులుపడ్డాయి.

పినాకపాణి తీక్షణంగా చక్రవర్తి వైపు చూసాడు. చక్రవర్తి తల దించుకున్నాడు. పిల్ల తండ్రి అయోమయంగా అందరి వైపూ చూసాడు.

ఒక అర నిముషం గడిచాక, సాధ్యమైనంత మృదువుగా పినాకపాణి అన్నాడు- "ప్రస్తుతం నీకు కాలక్షేపం ఎట్లా అవుతోందమ్మాయి?"

గంగాధరం అందుకున్నాడు. "ఏముందండీ! కుట్లూ, ముగ్గులూ, వంటా—ఇవి మామూలే కదా!"

పినాకపాణి, "కుక్కర్‌తో వంట చేయటం నీకు వచ్చా అమ్మాయ్!" అన్నాడు.

"వచ్చండి."

"అయితే చెప్పు! కుక్కర్ గిన్నెలో నీళ్ళు తక్కువగా పోసి స్టవ్ మీద పెడితే ఏమవుతుంది?"

"వాల్వు కరిగిపోతుందండి. గిన్నె అడుగు కిందికి ఉబ్బుతుందండి."

"అసలు నీళ్ళు పొయ్యకుండా పెడితే?"

"గిన్నె అడుగు పగిలిపోతుందండి."

చక్రవర్తి పినాకపాణి వైపు వింతగా చూసాడు. పినాకపాణి లక్ష్మిని మళ్ళీ అడిగాడు. "ఇంత ఖచ్చితంగా చెప్పగలుగుతున్నావు. నీకెప్పుడో అనుభవాలయి ఉంటాయి. ఏమంటావు?"

లక్ష్మి సిగ్గుతో తలవంచుకుంది. "అవునండి. మా యింట్లో ఇప్పటికి రెండు కుక్కర్లు అయ్యాయండి."

వినిపించీ, వినిపించనట్లుగా చక్రవర్తి అన్నాడు- "మతిమరుపు మనిషన్న మాట!"

"ఏమిటో అంటున్నారు!" అన్నాడు గంగాధరం.

పినాకపాణి అన్నాడు- "ఈ విషయాలకేం గాని అమ్మాయ్! మా ప్రకటనలో 'చిన్న చిక్కు' నవల విషయం రాశాము. ఆ నవల చదివారా?"

లక్ష్మి మెల్లిగా తలెత్తి చూసింది. "చదివానండి."

"పుస్తకం కొని చదివావా?"

"లేదండి. మా ఫ్రెండ్స్ పదిమంది ఉన్నామండి. వాళ్ళల్లో ముగ్గురు కొన్నారండి. వాళ్ళ దగ్గర తీసుకొని చదివానండి."

పినాకపాణి వెనక్కి ఆనుకుని

కళ్ళుమూసుకుని, ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఒక నిముషం తరువాత కళ్ళు తెరిచి, "బాబూ! మీరింక వెళ్ళవచ్చు. ఏ విషయమూ మీకు తరవాత తెలియపరుస్తాం" అన్నాడు.

దిగాలుపడ్డ మొహంతో గంగాధరం, పినాకపాణివైపు చూసాడు. "బాబూ! ఆస్తిపాస్తులూ, బంగారం వంటి ముఖ్యమైన విషయాలు మనం చర్చించనేలేదు. కట్నం విషయంలో పది పన్నెండు వేలకు పైన తూగలేను. పిల్లవాడిని గురించి విని, ఆశపడి వచ్చాను. ఆ పైన మీ ఇష్టం."

"సరేలెండి. ఏ విషయమూ తెలియపరుస్తామని చెప్పాను గదా"

తండ్రీ కొడుకులిద్దరూ లేచారు. తండ్రీ కొడుకులకు నమస్కారం పెట్టారు. అవతలి గదిలోకి వెళ్ళిపోయారు.

చక్రవర్తి ఒక్కుదుటన లేచి వచ్చి పినాకపాణి పక్కన పడ్డాడు. "బాబోయ్, ఈ పిల్లను నేను భరించలేను. సంగీతం పేరు చెప్పి, నా చెవులు, వంట పేరు చెప్పి, నా కడుపు గిన్నెలు పగలగొట్టేట్లుంది. ఒద్దొద్దు."

పినాకపాణి, "సరేలేరా, నేను నిన్ను బలవంతం చేసానా.... ఏమిటి? .... సరేగాని అబ్బాయ్! ఆ పిల్లను పాట ఆపేయమన్నావు. ఏమయినా బాగుందా? నువ్వు కొంచెం క్రూరత్వం తగ్గించుకోవాలి. ఈ రకం ఇంటర్వ్యూలే మన వాళ్ళకు కొత్త. ఆ వచ్చిన పిల్లనుకాస్తా నువ్వు బెదరగొట్టేస్తే ఎట్లా?"

చక్రవర్తి తలవంచుకున్నాడు.

పినాకపాణి తన పైలొకసారి చూసుకుని, "ఇదుగో గుమాస్తా గారూ! మధు బిందు అనే అమ్మాయిని పిల్చుకురా!" అన్నాడు.

గుమాస్తా వెళ్ళి ఒక అమ్మాయిని, ఒక వృద్ధుణ్ణి వెంటబెట్టుకొనివచ్చాడు. పినాకపాణి కూర్చోమనే లోపలే ఆ అమ్మాయి తాను ముందుగా సోఫాలో కూర్చుని, తరవాత వృద్ధుడ్ని తనపక్కన కూర్చోపెట్టుకుంది. నమస్కార ప్రతి నమస్కారాలయ్యాయి.

వృద్ధుడివైపు చూస్తూ, పినాకపాణి కదలేసాడు, "మీరు....?"

వృద్ధుడు తన కళ్ళజోడు సవరించుకున్నాడు. చప్పి, దవడలు తాటిస్తూ నెమ్మదిగా అన్నాడు. "అయ్యా, ఈమె నా దౌహిత్రి, నా కూతురూ, అల్లుడూ నష్టమైపోయి, ఇదీ దీని కింద ఇంకా ముగ్గురు మనవరాళ్ళూ నాకు మిగిలారు!

చూపు ఆశనివాణ్ణి. వయసు వెళ్లిన వాణ్ణి. అక్కడికీ ఎట్లాగో యూ, పెద్ద దానికి నాలుగయిదు సంబంధాలు చూసాను. ఒక్కటీ అతకలేదు. పెళ్ళికుమారుడు నా ఇంటికి వస్తే, అతకటం లేదేమోనని నేనే పెళ్ళి కుమారుని ఇంటికి వచ్చాను. ఆ పైన భగవంతుని దయ"

పినాకపాణి చక్రవర్తిని చూపిస్తూ, "ఇతడే పెళ్ళి కొడుకు, నా తమ్ముడి సంతానం. నా పేరు పినాకపాణి," అన్నాడు.

అందరూ టీ తాగారు.

పినాకపాణి అమ్మాయిని అడిగాడు. "నీ పేరమ్మా?"

"నా పేరు మధుబిందు. ఇంటర్ చదివి ఆపేశాను."

"మంచిది. ఇప్పుడేం చేస్తున్నావ్?"

"సాహిత్య సేవ చెయ్యాలనుకుంటున్నాను. నవలలు రాస్తున్నాను"

చక్రవర్తి, పినాకపాణి మొహమొహాలు చూసుకున్నారు. చక్రవర్తి తన పైన్లో ఏదో రాసుకున్నాడు.

పినాకపాణి, "గుడ్, ఇప్పటికి ఏం రాసావేమిటి?"

ఆ అమ్మాయి వెనక్కి ఆనుకుని, స్వేచ్ఛగా, కూర్చుంది. సిగ్గు, బిడియమూ అనేవి ఏ మాత్రమూ ప్రదర్శించకుండా మార్చి మార్చి అందర్నీ చూస్తూ చాలా తాపీగా అంది- "ఎక్కువేం లేవనుకోండి. అయినా... ఓడజనుదాకా రాసాను. ....ఇటీవల రాసినవి చెప్పమంటారా?"

"చెప్పు?"

" 'మొదటి రాత్రి', 'ప్రేమను ప్రేమకై ప్రేమతో ప్రేమమయంగా ప్రేమించు" 'అతకని బతుకులు' 'చావే మంచిది'—ఇవండి!"

" 'మొదటి రాత్రి' అంటున్నావు పెళ్ళిలో మొదటి రాత్రా? ....అట్లా అయితే, పెళ్ళికాని దానివి కదా! నువ్వా పుస్తకం ఎట్లా రాయగలిగావు?"

చక్రవర్తి పైలును పక్కన బెట్టి, ముందుకు వంగి వింటూ కుతూహలం కనిబరిచాడు.

మధుబిందు మొహంలో కంగారు తొంగి చూసింది. "అహహా! ఇంకోకలా అనుకోకండి. రచయిత్రికి అనుభవం కంటే ఆలోచన, ఇన్స్పిరేషనూ ముఖ్యం. మొదటి రాత్రిని నేను పూర్తిగా ఆలోచనతోనే రాసాను."

"అదే, ఎట్లా రాయగలిగావూ అని!"

"అదంతా ట్రేడ్ సీక్రెట్ అండి.

....పోన్లెండి, అడిగారు గనక చెప్పేస్తాను..... మా పెదనాన్న కూతురు పెళ్ళిలో వాళ్ళ మొదటి రాత్రి నేను వాళ్ళకు తెలియకుండా గదిలో ఓ మూల మైక్ ఎరేంజ్ చేసి దాన్ని పక్క గదిలో టేప్ రికార్డర్‌కు కనెక్ట్ చేసాను..... ఆ ఒక్క రాత్రికి ఒక అరడజను టేపులు అవసరమయ్యాయనుకోండి."

పినాకపాణి, చక్రవర్తి తెల్లబోయారు.

పినాకపాణి అన్నాడు, "సరేనమ్మాయ్! మరి 'అతకని బతుకులు' ఎట్లా రాయగలిగావు?"

"అదాండి. అదీ సింపులేనండి. ....మా దొడ్డివైపు గోడ పక్కన పాకలో గుమాస్తాగా ఒకాయన ఉంటున్నారండి. వాళ్ళబ్బాయికి ఈ మధ్యనే పెళ్ళయింది. మరి నా కథకు మెటీరియల్ కావాలి కదండి. ఆ అబ్బాయికి ఎవరో అమ్మాయి రాసినట్టూ ఆ అమ్మాయికి ఎవరో అబ్బాయి రాసినట్టూ రెండు లవ్ లెటర్స్ రాసి పడేశానండి. ఇక చూసుకోండి- వాళ్ళ వాదనలూ, సాధింపులు, రుసరుసలూ, కొట్లాటలూ__అన్నీ మనకు మెటీరియల్ అయిపోయాయి. అదండి. ఆ విధంగా 'అతకని బతుకులు' తయారైంది."

పినాకపాణికీ, చక్రవర్తికీ మొహాల్లో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. చక్రవర్తి గుడ్లు మిటకరించి నోరు తెరుచుకొని చూస్తూ ఉండిపోయాడు. ఉండి ఉండి చక్రవర్తి ఆ అమ్మాయితో ఏదో అనబోయాడు. పినాకపాణి అతన్ని వారించి ఆ అమ్మాయితో అన్నాడు. "ఇంతకీ ఎన్ని నవలలు అచ్చయినాయి?"

మధుబిందు నిట్టూర్చింది-"ఏమిటోనండి. ఒక్కటీ అచ్చవలేదు. ఎవరికి చూపించినా, 'మా కొద్దు, మా కొద్దు.' అంటున్నారు. ఇంక నేనే స్వయంగా పబ్లిష్ చేద్దామనుకొంటున్నాను. నా పెళ్ళయ్యాక మా శ్రీవారు సహాయపడక పోతారా అని ఆశగా వుంది." ఇట్లా అంటూ ఆ అమ్మాయి చక్రవర్తి వైపు ఓరగాచూపి నవ్వింది.

చక్రవర్తి గతుక్కుమన్నాడు.

పినాకపాణి అన్నాడు. "సరేనమ్మాయ్! అదలా ఉంచు. బైరాగి రాసిన 'చిన్నచిక్కు' నవల నువ్వు చదివావనుకుంటాను?"

"చదివానండి."

"కొని చదివావా?"

"లేదండి. అద్దె పుస్తకాల కొట్లోంచి తెచ్చుకొని చదివానండి."

పినాకపాణి కళ్ళు మూసుకుని వెనక్కు జారగిలబడి, చేతితో తుడుచుకున్నాడు. అర నిమిషం పోయాక కళ్ళు తెరుస్తూ అన్నాడు. "సరేనండి తాతగారు! ఇంక మీరు వెళ్ళవచ్చు. ఏ విషయమూ మీకు మేము తర్వాత రాస్తాము"

ఆ అమ్మాయి, వృద్ధుడూ లేచి నిలుచుని ఇద్దరికీ నమస్కారాలు పెట్టారు. గదిలోంచి బయటకు వెడుతూ వెనక్కు తిరిగి చక్రవర్తివైపొకసారి చూపింది ఆ అమ్మాయి.

వాళ్ళు అట్లా బయటకువెళ్ళారో లేదో, చక్రవర్తి హఠాత్తుగా లేచి వచ్చి, పినాకపాణి మీద పడిపోయాడు. "బాబాయ్! నాకీ పిల్ల కూడా వద్దు. ఈ పిల్ల తన నవలలు అచ్చెయ్యేందుకు మాత్రమే ఒక మొగుడవసరం అన్నట్లు మాట్లాడుతోంది. నేను గాని చేసుకున్నానా, 'ఛబ్బు, తే, తే.' అని నన్ను సతాయించి పీల్చి పిప్పి చేసేస్తుంది."

"కంగారు పడకోయ్! ఈ కేసు నాకూ నచ్చలేదు. తరవాతి కాండిడేట్‌ను పిలుద్దామా?"

చక్రవర్తి వెనక్కు తగ్గాడు. లేచి గదిమూలకు వెళ్ళి, కూజాలోంచి మంచినీళ్ళు గ్లాసులోకి వంచుకొని గడగడా తాగి, రుమాలుతో మొహం తుడుచుకుంటూ వచ్చి తనసీట్లో బరువుగా కూలబడ్డాడు.

"పిలు బాబాయ్!" అన్నాడు.

పినాకపాణి తన ఫైలొకసారి చూసుకున్నాడు. అంత వరకూ దూరంగా కుర్చీలో కూర్చొనున్న గుమాస్తావైపు చూస్తూ, 'మిస్ ఆర్తిని పిలుచుకురా" అన్నాడు.

ఒకటి రెండు నిముషాల్లో "మిస్ ఆర్తి వచ్చింది. వస్తూనే గది అంతటినీ ఇంటిమేట్ సెంట్ వాసనతో నింపివేసింది. హైహీల్సు షూస్, చేతిలో చిన్న సూట్‌కేసంత వానిటీ బాగ్, పెదిమెలకి లిప్‌స్టిక్, లోనెక్ జాకెట్, నడకలో వయ్యారం— ఈ రూపు రేఖల్తో ఆ అమ్మాయి ఒంటరిగానే వచ్చింది. వస్తూనే సోఫాలో కూర్చుని, కుడిచెయ్యి కొంచెం పైకెత్తి "గుడ్ మార్నింగ్ సర్స్!" అంది. వీళ్ళిద్దరూ నమస్కారాలు పెట్టారు.

పినాకపాణి, "మీరు ....?" అన్నాడు.

"ఓహ్! యు మీన్ మైనేమ్! అయామ్ మిస్ ఆర్తి. వర్కింగ్ ఇన్ టెలిఫోన్స్ ఎట్ గుంటూర్. ఐ హావ్ టూ యంగర్ సిస్టర్స్. మై ఫాదర్ వజ్ డెడ్," అన్నది

ఆర్తి.

"ఓ ఐసీ, వెరీగుడ్! ఇతనే పెళ్ళికొడుకు, మిస్టర్ చక్రవర్తి. ఐ యామ్ పినాకపాణి."

"వెరీగ్లాడ్" అంది ఆర్తి. చక్రవర్తికి షేక్‌హాండ్ ఇవ్వబోయింది. చక్రవర్తి అందుకోలేదు.

టీ సేవనం పూర్తయింది.

పినాకపాణి అన్నాడు. "చూడండి ఆర్తిగారూ! ఇది ఇంటర్వ్యూ కనక కొన్ని ప్రశ్నలు అడగటం సహజం. మీకు తోచిన సమాధానాలు చెప్పండి.... మీకు వంట అలవాటుందా?"

"ఇంట్లో వంటవాడుండగా వంట నేర్చుకోవలసిన అవసరమేమిటండీ?"

"అదేమిటి! మీకాబోయే భర్తకు మీరు స్వయంగా చేసిపెట్టే ఆనందాన్ని మీరు కోరుకోరా?"

ఆర్తి నవ్వింది. "ఓ, అదా! ఆ అవసరమే వస్తే, నా హస్బెండ్ నాకు సహాయం చెయ్యకపోతారా? నేను ఓ నాలుగు డిషెస్ చేసిపెట్టలేకపోతానా?"

చక్రవర్తి మొహంలో చిలిపితనం తొంగి చూసింది.

"ఏ డిషెస్సు?" అన్నాడు.

"ఎనీ డిషెస్. ఇఫ్ యు ప్రిఫెర్, సైడ్ డిషెస్ ఆల్సో!" (ఏ పదార్థాలయినా పరవాలేదు. మీరు కోరుకుంటే, పక్కారుచులు కూడా) అందిఆర్తి. ఇలా అంటూ ఓరగా చూసి నవ్వింది.

తండ్రీ కొడుకులు తెల్లబోయారు.

కొన్ని క్షణాల తర్వాత పినాకపాణి అన్నాడు, "ఆల్‌రైట్, మాడమ్! మరో ప్రశ్న.... వేదాలు ఎన్ని?"

ఆర్తి మందహాసం వెలిబుచ్చింది. "మూడు."

ఉలిక్కిపడ్డాడు చక్రవర్తి. "ఎట్లాగా?"

"వే—దా—లు, మూడేకదా అక్షరాలు!"

తండ్రీ కొడుకులు మొహాలు మొహాలు చూసుకున్నారు.

పినాకపాణి అడిగాడు, "యోగాభ్యాసం మానసిక శాంతిని కలుగజేస్తుందంటారు కదా, మీరేమంటారు?"

"యోగాభ్యాసమా?—ఏమిటో మీ భాష నాకు అర్థంకావటంలేదు. శాంతి కావాలంటే మాత్రం ఈజీగానే దొరుకుతుందికదా? ఊటీకో డార్జిలింగ్‌కో, కేవలం బీచ్‌కో వెళ్ళి రెండు ట్రిపుల్ ఫైవ్ టిన్నులు, ఓ డజను మొపాసా స్టోరీ వాల్యూమ్స్ దగ్గర పెట్టుకుంటే, హాయిగా ఎన్నిరోజులైనా గడిపేయవచ్చు.

ఎన్నాళ్ళమంచో నాకున్న కోరిక అదే!"

చక్రవర్తి అన్నాడు, "ట్రిపుల్ ఫైవ్ టిన్నులా!"

"యస్. మీరు అవ్వి వాడరా?"

"నాకు సిగరెట్లు అలవాటు లేదండి."

"వండర్!" (ఆశ్చర్యంగా ఉందే)

పినాకపాణి కళ్ళల్లో ఎర్ర జీరలు పడ్డాయి. చాలా తీక్షణంగా చక్రవర్తి వైపొకసారి చూశాడు. తిరిగి ఆర్తి వైపు చూస్తూ అన్నాడు-

"అది వదిలేద్దాం మాడమ్! మరొక చిన్న ప్రశ్న.... కొత్త కేంద్ర ప్రభుత్వం అందరికీ మంచి కూడూ గుడ్డా ఇవ్వగలదంటారా? మీ అభిప్రాయం ఏమిటి?"

"ఎందుకు సార్? అలగా జనం లాగా మనం కూడా వర్రీ అవటం! మీ అబ్బాయికి పదిహేను వందల జీతం అన్నారు. పైగా కారు, అనేక ఫ్రీలు ఉంటాయి. అసలు మేమిద్దరం కార్లో తిరిగినప్పుడల్లా మంచి కూడు ..పెట్టే హోటళ్ళకే వెళతాం కదండీ! మాకింక కూడు సమస్యేముంది?.... ఐ డోన్ట్ క్వైట్ అండర్ స్టాండ్ యువర్ పాయింట్!" (అసలు మీ ప్రశ్న నాకు అర్థం కావటంలేదు)

మళ్ళీ వాళ్ళిద్దరూ ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు.

పినాకపాణి అన్నాడు, "మా అబ్బాయికి కాబోయే భార్య, 'చిన్న చిక్కు నవల'— అదే, ప్రసిద్ధ రచయిత "బైరాగి" రాసింది. దానిలోని హీరోయిన్ లాగా అన్ని మంచి లక్షణాలూ కలిగి ఉండాలని మేము ప్రకటించాము. మీరు దాన్ని చదివారనుకుంటాను!"

"లేదండీ! అసలా బుక్కే దొరకలేదు. గుంటూర్లో ఏ బుక్ షాప్‌లో అడిగినా, అలాంటి చెత్త నవలలు తెప్పిస్తే తమ బిజినెస్ దెబ్బ తింటుందని ఎవరూ తెప్పించలేదని చెప్పారండి. చదవలేదు."

పినాకపాణి మొహంలో నిరుత్సాహం తొంగి చూసింది...

ఆర్తి తనవాచీ చూసుకుంది. "ఓ మైగాడ్! ఎక్స్‌క్యూజ్ మిసర్, నాకు మాట్నీకి టైమైంది.... నేను వెళ్ళ వచ్చా?" అంటూ నుంచుంది.

పినాకపాణి, "సరే, వెళ్ళరండి" అన్నాడు.

"అన్నట్లు మరి అసలు విషయం.... అదే, మీ అబ్బాయి నాకు నచ్చారు. మరి మీ అబ్బాయికి నేను నచ్చినట్లు...."

"ఉత్తరం రాస్తాంలెండి. ప్రస్తు

తానికి మీరు మాట్నీ అందుకోండి."

"ఓహ్, థాంక్యూ వెరీమచ్. గుడ్ బై మిస్టర్ చక్రవర్తీ!" ఆమె చక్రవర్తి వైపు నడిచి మళ్ళీ షేక్ హాండ్ ఇవ్వబోయింది.

చక్రవర్తి గాబరాగా నుంచొని తన రెండు చేతులూ జోడించి, "నమస్తే" అన్నాడు.

ఆరతి, ఇద్దరివైపూ ఒకసారి చూసి కిసుక్కున నవ్వి, "గుడ్ బై" అంది. హైహీల్సు టకటక లాడించుకుంటూ బయటకు వెళ్ళి పోయింది.

ఈ మాటు చటుక్కునలేచి రావటంపినాకపాణి వంతుఅయింది. లేచి వచ్చి చక్రవర్తి భుజంమీద చెయ్యి వేసి, "అబ్బాయ్! ఇది గాలి నరుకు. ఫటాఫట్ వెరైటీ. నువ్వు దీన్ని కట్టుకోవడమే పొరపాటు. అథవా, కట్టుకున్నావే అనుకో. నీ కన్నా దబ్బున్నవాడుఇంకోడు కవిపిస్తే, నువ్వేసిన మూడుముళ్ళూ మూడో నిముషంలోఫట్ ఫట్ మని తెంచేసి ఎగిరి చక్కాపోతుంది. తోసేయ్ ఈ కేసును. ఏమంటావ్?" అన్నాడు.

"నేను అనబోతున్న మాటనే నువ్వు అనేసావు. అట్లాగే కానివ్వు బాబాయ్!"

ఆ తరువాత వాళ్ళిద్దరూ, మిగిలిన ముగ్గురు ఆడపిల్లల్నీ ఇంటర్వ్యూ చేసారు. ఆ ఇంటర్వ్యూలూ ఇలాగే సాగాయి. ఆ పిల్లలెవ్వరూ 'చిన్నచిక్కు'ను గురించి పినాకపాణికిసంతృప్తికరమైనసమాధానాల్వివ్వలేదు. ఇంటర్వ్యూ లయిపోయినవి.

ఆ రాత్రి పినాకపాణి, చక్రవర్తితో,—ఇంకో అడ్వర్టయిజ్‌మెంట్ పేపర్లోవేయించి, ఇంకో రౌండు ఇంటర్వ్యూలు జరిపిస్తే బాగుంటుందన్నాడు. అయిష్టంగానే చక్రవర్తి ఒప్పుకొన్నాడు. ఆ అడ్వర్టయిజ్‌మెంటు ఇట్లా ఉంది.

"మా అబ్బాయి పెళ్ళి విషయమై గతనెల 2వ తేదీన ప్రకటించిన విధంగా, మేము జరిపిన ఇంటర్వ్యూల్లో ఏ కన్యా మాకు నచ్చని కారణంగా, ఇంకొకసారి ఇంటర్వ్యూలు జరుప నిశ్చయించుకున్నాము. ఇష్టం ఉన్నవాళ్ళు అమ్మాయి ఫోటోతో సంప్రదించండి. ఇప్పుడు మేము చూసిన కన్యలు తిరిగి అప్లై చేసుకోనక్కర్లేదు. ముఖ్యగమనిక: ఆంధ్రదేశపు నవలాసామ్రాట్ 'బైరాగి' రాసిన 'చిన్న చిక్కు' నవలను తాను చదివినట్లుగానూ, అందులోని హీరోయిన్‌కు ఉన్న లక్షణాలన్నీ

తనకీ ఉన్నాయని తాను నమ్ముతున్నట్లుగానూ, కన్య తన స్వదస్తూరీతో రాసిన సర్టిఫికెట్టు ప్రతి అప్లికేషనుకు జతచేయబడి ఉండాలి."

చక్రవర్తి అడిగాడు, "బాబాయ్! ఈ చిన్న చిక్కేమిటి? ఈ బైరాగెవడు? నేనెప్పుడూ వినలేదే!"

పినాకపాణి అన్నాడు. "అమ్మమ్మా! అట్లా ఏకవచన ప్రయోగం చెయ్యకు. ఆయన ఒక మహారచయిత! ముమ్మిడివరం బాలయోగిలాగా ఆయన రచనలు ఏడాదికొకసారి దర్శనమిస్తూంటాయి. నీకు తెలియనంతమాత్రాన ఆయన్ను తీసిపారెయ్యకూడదు. తప్పు!"

చక్రవర్తి తలగోక్కున్నాడు.

* * *

కొత్త అడ్వర్టయిజ్‌మెంటు, చిన్నదీ, పెద్దదనే భేదంలేకుండా ఆంధ్రదేశంలో అచ్చయి అయిదారు హస్తాల్లోపడే ప్రతి పత్రికలోనూ ప్రకటితమైంది.

ఫలితంగా, వారం తిరిగేసరికి ఓ నూటయాభై అప్లికేషన్లు వచ్చిపడ్డాయి. ఇద్దరూకూర్చుని వాటిని వడపోసారు. ఓ అరడజను సెలెక్ట్ చేసారు. మళ్ళీ ఇంటర్వ్యూలు జరిగాయి. నలుగురు అమ్మాయిలు తాము ఆ నవలనుకొని చదివామని చెప్పగా, మిలిగిన ఇద్దరూ కొనకుండా చదివామన్నారు. ఇంటర్వ్యూలు అయిపోయిన రాత్రి చక్రవర్తి, తనకా ఆరుగురిలోనూ చివరి అమ్మాయి నచ్చిందన్నాడు.

పినాకపాణి, "నీకు ఆ అమ్మాయేకాదు, ఏ అమ్మాయీ నచ్చే అవకాశంలేదు." అన్నాడు.

"ఏం-ఎందుకని?"

"వాళ్ళల్లో ఎవ్వరూ 'చిన్న చిక్కు' నవల్లోని హీరోయిన్ పాత్రను బాగా అర్థం చేసుకోలేదు కనుక!"

"అదెవత్తో హీరోయిన్‌కు, నా కాబోయే భార్యకు సంబంధమేమిటి?"

"చక్రూ! కుర్రాడవ్, నీకు తెలీదు. అది అంతే!"

* * *

మర్నాడు పొద్దున్నే చక్రవర్తి పినాకపాణితో, "బాబాయ్: నాకు సెలవు అయిపోయింది. నేను ఈ వేళే కలకత్తా వెళ్ళాలనుకుంటున్నాను." అన్నాడు.

పినాకపాణి మొహంలో నీరసం తొంగిచూపింది. "ఆఁ, వెళతున్నావా?....సరే కానీ....అసలు నాకూ ఏదో అర్జంటుపని తగిలిందిలే. ఇప్పుడే బయల్దేరి వాల్తేరు వెడు

తున్నాను. రెండుమూడు వారాల్దాకా రాకపోవచ్చు. చూడు: అనక, పది గంటలు దాటింతర్వాత, ఈ కవరు తీసికెళ్ళి, గాంధీనగరంలో ఉన్న, 'ది బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ పబ్లిషింగ్ కంపెనీ' ప్రొప్రయిటర్‌కు ఇవ్వు చాలు. అతను వెంటనే నీకు అయిదువేలు డబ్బిస్తాడు. అతన్ని నువ్వు ప్రశ్నలేమీ అడగనక్కర్లేదు. ఆ డబ్బుతీసికెళ్ళి, గవర్నరుపేటలో స్టేటుబ్యాంకు ఉందిచూడు, దాంట్లో నా ఎస్. బి. ఎక్కౌంటు 1425లో క్రెడిట్ చెయ్యి. విధిలేక ఈ పని నీకు చెప్పవలసివస్తోంది. ఏమీ అనుకోవుగదా!.... మరింక నువ్వు వెడతానంటావా, కానీ, మళ్ళీ నీకు సెలవు దొరికినప్పుడు రా. అసలు ఈ లోపలే నేను మంచి సంబంధం ఒకటి వాకబుచేసి ఉంచుతాననుకో," అంటూ పినాకపాణి, చక్రవర్తిచేతిలో ఒక కవరు ఉంచాడు, బయటకు వెళ్ళిపోయాడు.

* * *

పదిరోజుల తర్వాత పినాకపాణి రైలుదిగి వచ్చేసరికి అతని గదిలో టేబిల్‌మీద ఈ ఉత్తరం ఉంది.

"బాబాయ్! నీ తెలివి అమోఘం! నువ్వే 'బైరాగి' వనీ, 'చిన్న చిక్కు' నువ్వు రాసిన నవలే అనీ నాకు తెలియకుండా ఎంత నాటకమాడావ్!.... మొన్న నేను వెళ్ళే సమయానికి ఆ పబ్లిషర్ చేతిలో 'చిన్న చిక్కు' పుస్తకం ఉండి ఉండకపోతే, ఇప్పుడయినా నాకీ విషయం తెలిసి ఉండేది కాదుకదా! నువ్వాపుస్తకం ప్రింటు చేయించుకున్ని ఏడాది గడిచినా యాభై కాపీలు అమ్ముడవటం కష్టమైపోయింది. ఇంతలో నేను నీకు దొరికాను. మొదటి అడ్వర్టయిజ్‌మెంట్‌లో నీ నవలకు నువ్విచ్చుకున్న పబ్లిసిటీ కారణంగా టకటకా రెండొందల కాపీలు అమ్ముడయ్యాయి. రెండో అడ్వర్టయిజ్‌మెంటుతో ఇంకో మూడొందల కాపీలు అమ్ముడయ్యాయి. ప్రింటింగ్ చార్జీలు, అమ్మిపెట్టినందుకు కమీషను వగైరాల కింద, మొదటి యాభై కాపీల సొమ్మునూ నీ పబ్లిషర్ మిత్రుడికి నువ్వు వదిలెయ్యగా, తరువాత అమ్ముడుపోయిన ఈ అయిదు వందల కాపీలకూ, కాపీకి పది రూపాయల చొప్పున వచ్చిన ఆదాయం అయిదువేల రూపాయలనూ వసూలు చేసుకు రమ్మనమని నన్ను పంపావు. నేను గాని నీ ఈ రహస్యాన్ని తెలుసుకోకపోయి ఉన్నట్లయితే యింకా ఎన్ని ఇంటర్వ్యూలు జరిపేవాడివో,

ఎన్ని 'చిన్నచిక్కు' కాపీలు అమ్ముకునే వాడివో! ఎంతగా నీ బ్యాంకు ఎకౌంటును పెంచుకొనేవాడివో! నువ్వు కోరుకున్నంతసొమ్ము పోగుబడేవరకూ నన్ను ఏ పిల్లనూ సెలెక్టు చేసుకోనిచ్చేవాడివి కావు కదూ? అసలు, నువ్వు ముందరగా నా ఇష్టం లేకుండానే, ఉద్యోగానికి ప్రకటించినట్లు, పెళ్ళిచూపులకు ఇంటర్వ్యూ ప్రకటించావు. ఆంధ్ర దేశపు నలుమూలలా ఉన్న ఆడ ప్రాణాల్ని ఒక ఊపు ఊపేశావు! తెలుగునాటలేని ఒక దిక్కుమాలిన సంప్రదాయానికి, నాంది పలికావు. ఎంత అద్భుతంగా మిమ్మల్నందర్నీ ఎక్స్‌ప్లాయిట్ చేసుకున్నావయ్యా!

"....సరే, విను: ఏ రకంగా చూసినా ఈ అయిదువేలూ నాకు చెందుతాయి. కనుక ఈ డబ్బును నా స్వంతం చేసుకుంటున్నాను. మరింక ఈ డబ్బు విషయం నాతో ఎప్పుడూ ఎత్తకు.

"పోతే, మొన్న ఒక పంతులు దగ్గర్నుంచి ఒక ఉత్తరంవచ్చింది. చూడు, తనకో సంసారపక్షంగా పెరిగిన చెల్లెలుందనీ, తను కట్నం ఇచ్చుకోలేకపోయినా, 'ఆప్యాయతలు అనురాగాలకు తన ఇంటలోటులేదనీను- ఆయన ఇంటికి నిన్ననే నేను వెళ్ళి, ఆ అమ్మాయిని చూసి వచ్చాను. అందం సామాన్యమేననుకో. కాని ఎంత ఒద్దిక! ఎంత వినయం! ఏదో క్లాసుచదువే. అయినా ఆ అమ్మాయి సంస్కారానికి కొలబద్దల్లేవు! నేను ముగ్ధుణ్ణయ్యాను. వాళ్ళతో ప్రధానం చేసేసుకున్నాను. వచ్చే నెల్లో నే ముహూర్తంకూడా. శుభలేఖ పంపుతాను. నువ్వొస్తేసంతోషమే. కనీసం పిన్నినీ, పిల్లల్నైనాపంపు. నేను వెడుతున్నాను.

నీ కుమారుడు,
చక్రవర్తి."

పినాకపాణి మొహం పాలిపోయింది. ఉత్తరం జారి కింద పడింది.

"పోయిన డబ్బుపోగా, వీడొక శనిగాడయి బంధువర్గంలో నా గురించి ఉచితంగా ఉన్నవీ ఉండనివీ ఊదిపారేస్తాడు కాబోలు! 'చిన్న చిక్కు' అయినా ఇంక అమ్ముడు పోతుందనుకోను. డామిట్! ఎంతపని జరిగింది? అయినా ఇనప చువ్వలమ్ముకొంటున్న నేను, ఈ రంగంలోకి దిగటమేమిటి? ఇది 'చిన్నచిక్కు' కాదు. పెద్దచిక్కు! నా పాలిట యమచిక్కు! వీరచిక్కు! యమరణ వీర చిక్కు!! ఛీ-ఛీ!!!" అనుకున్నాడు పినాకపాణి. *